రెండు రోజులు వర్షాలు

నేడు రాష్ట్రాన్ని వీడనున్న నైరుతి ● హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): రానున్న రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. నైరుతి తిరోగమనం చివరి దశకు చేరుకోవటంతో పది రోజులుగా వర్షాలు పడటం లేదని చెప్పింది. రాష్ట్రం వైపు తూర్పు, ఈశాన్యం దిశల నుంచి గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. భారీ వర్షాలకు అవకాశం లేకపోయినా జల్లులు కురుస్తాయని చెప్పింది. ఈసారి తెలంగాణలోని 18 జిల్లాలో అధిక వర్షపాతం నమోదు కాగా, మిగిలిన జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది. నైరుతి సోమవారంతో రాష్ట్రాన్ని వీడిపోతున్నట్టు చెప్పింది.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
సమర్పించు
దసరా షాపింగ్ బోనాంజా
ఆరవ డ్రా విజేతలు

S No.	Gift	Winner Name	Coupon No.
1	32" టెలివిజన్	బి. జయంత్ రెడ్డి	08407
2	మొబైల్	జి. అంజ నేయులు	52969
3	మైక్రో ఓవెన్	ఎ. లక్ష్మి నివాస్	33972
4	గిఫ్ట్ వోచర్	సంతోష్	46705
5	గిఫ్ట్ వోచర్	శైలజ	34007

పదివేల కిలో మీటర్ల సైక్లింగ్ చాలెంజ్

హెచ్‌సీజీ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : 'వీ లవ్ సైక్లింగ్.. వీ లవ్ సైక్లింగ్' నినాదాలతో ఆదివారం సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్ హోరెత్తింది. హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో పదివేల కిలో మీటర్ల మేర సైక్లింగ్ చాలెంజ్ నిర్వహించారు. ముందుగా, ఈ కార్యక్రమాన్ని డీసీపీ శిల్పావల్లి జెండా ఊపి ప్రారంభించారు. నగర సైక్లిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని చాలెంజ్‌ను విజయవంతంగా ముగించారు. సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్ చాలా గొప్పగా ఉందంటూ ప్రశంసించారు. దేశంలోనే మొదటి సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సైక్లిస్టులు ధన్యవాదాలు తెలిపారు.

ఆ ఘనత పీఆర్టీయూ టీఎస్‌దే

- **పదోన్నతుల షెడ్యూల్, ఈహెచ్ఎస్ జీవో విడుదల సంఘం విజయమే**
- **రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): టీచర్ల పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయించిన ఘనత పీఆర్టీయూ టీఎస్‌దేనని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. ఉద్యోగులకు పూర్తి నగదు రహిత చికిత్సనందించే హెల్త్ స్కీం జీవోను ప్రభుత్వం జారీ చేయడం సంఘం సాధించిన గొప్ప విజయంగా ఆయన అభివర్ణించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ మొదటి పీఆర్సీలో 30శాతం ఫిట్‌మెంట్‌ను సాధించామని చెప్పారు. రెండో పీఆర్సీ ద్వారా మంచి ఫిట్‌మెంట్ సాధించి ఉపాధ్యాయులకు కానుకగా అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియ కొనసాగేలా సంఘం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న టీచర్ల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. సంఘం ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా, సమావేశం ఆమోదించింది. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని, గురుకుల పాఠశాలల్లోని టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని, హెల్త్‌కార్డులను అందజేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి, ఇన్నారెడ్డి, చిత్తలూరి ప్రసాద్, గీత, త్రివేణి, విజయ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ కంపెనీల అడ్డాగా హైదరాబాద్, బెంగళూరు

- **2025 నాటికి సగం కార్పొరేట్ కార్యాలయాలు ఈ రెండు నగరాల్లోనే**
- **దేశంలోని 7 మెట్రో నగరాల వృద్ధి రేటుపై సీబీఆర్‌ఈ ఇండియా నివేదిక**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): భారత్‌లో గ్లోబల్ కంపెనీల కార్యాలయాలకు హైదరాబాద్, బెంగళూరు ప్రధాన కేంద్రాలుగా మారనున్నాయి. 2025 నాటికి దేశంలోని 7 మెట్రో నగరాల్లో ఏర్పాటయ్యే మొత్తం కార్పొరేట్ కార్యాలయాల్లో దాదాపు సగం ఈ రెండు నగరాల్లోనే ఏర్పాటు కానున్నట్టు సీబీఆర్‌ఈ ఇండియా తన నివేదికలో వెల్లడించింది. ఇప్పటికే హైదరాబాద్ వివిధ అంశాల్లో బెంగళూరును అధిగమించి మెరుగైన వృద్ధి రేటును నమోదు చేస్తున్న విషయం విదితమే. ఈ రెండు నగరాల్లో మెరుగైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవవనరులు అందుబాటులో ఉండటంతో పలు కంపెనీలు తమ గ్లోబల్ కేపబిలిటీ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్టు సీబీఆర్‌ఈ ఇండియా సౌత్ ఈస్ట్ ఏషియా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజైన్ స్పష్టం చేశారు.

2025 నాటికి కార్పొరేట్ కార్యాలయాల్లో నగరాల స్థానం

నగరం	మొత్తం కార్యాలయాల్లో శాతం
బెంగళూరు	29
హైదరాబాద్	20
ఢిల్లీ-ఎన్సీఆర్	17
పుణె	12
చెన్నై	11
ముంబై	9
కోల్‌కతా	2

భారత్‌లో ఆఫీస్ స్పేస్‌ను అందించడంలో బెంగళూరు, హైదరాబాద్ అత్యంత కీలకంగా మారనున్నాయని, వీటి తర్వాత ఢిల్లీ–ఎన్సీఆర్, ముంబై ఉన్నాయని తెలిపారు. బెంగళూరులో కొత్త కార్యాలయాల ఏర్పాటు ఎక్కువగా ఔటర్ రింగ్ రోడ్డు, నార్త్ బిజినెస్ డిస్ట్రిక్ ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నదని, హైదరాబాద్‌లో ఐటీ కారిడార్‌తోపాటు ఔటర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.